

రుద్రవరం లే అవుట్‌లో రోడ్డు, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రియల్ ఎస్టేట్ దళారులు అమ్మేయగా చదును చేసిన భూమి

రుద్రవరం కాలనీ రోడ్డును
అమ్మేశారు!

- ప్రభుత్వ, కాల్వ భూముల కబ్జా
- నాలుగు సెంట్ల స్థల విక్రయం
- రుద్రవరం లే అవుట్‌లో రోడ్డు స్థలానికి ఎసరు
- స్థానిక రియల్ దళారుల బండారం బట్టబయలు

ప్రభుత్వ స్థలం ఖాళీగా కన్పిస్తే అక్రమార్కులు బరితెగించేస్తున్నారు. రోడ్డు, డ్రెయిన్లు, కాల్వల భూములనూ వదలడం లేదు. రోడ్డుకు కేటాయించిన భూమి, కాల్వ భూమి ఆక్రమించి, చదును చేసి అమ్మేశారంటే వారు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. బందరు దక్షిణ మండలం రుద్రవరం లే-అవుట్‌లో రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని, దాన్ని ఆనుకుని ఉన్న కాల్వ భూమి మొత్తం నాలుగు సెంట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఓ వ్యక్తికి అమ్మేశారు. స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు వెళ్లి ఆరా తీస్తే వ్యవహారం బట్టబయలు అయ్యింది.

6

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కులు ఆక్రమించడమే కాదు, ఏకంగా అమ్మేస్తున్నారు. మచిలీపట్నం దక్షిణ మండలం పరిధిలో రుద్రవరం లేఅవుట్‌లో రహదారి నిర్మాణానికి కేటాయించిన భూమితోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇటీవల ఈ స్థలాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేశారు. మారుమూల ప్రభుత్వస్థలంలో ఎలాంటి కట్టడాలు నిర్మాణం చేసినా ఎవ్వరూ పట్టించుకోరని మాయమాటలు చెప్పి విక్రయించేసి సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిస్తే అసలు విషయం బయట పడింది.

రుద్రవరం గ్రామ పరిధిలో 10 ఎకరాలకు పైగా లే-అవుట్ వేసి మచిలీపట్నం నగరంలోని పేదలకు గతంలో ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఇందులో 60 శాతం మంది లబ్ధిదారులు గృహాలు కట్టుకుని నివాసం ఉంటున్నారు. కాలనీకి ఇచ్చిన స్థలానికి, బొంబాయి కాల్వ డ్రెయినేజీకి మధ్య ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ సెంటు భూమి రెండు లక్షలకుపైగా ధర పలుకుతోంది. కాలనీ రహదారి నిర్మాణం చేసేందుకు కేటాయించిన

మిగతా 6లో..



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై ముఖ్యఅతిథి, పంజాబ్ ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.వేణుప్రసాద్, విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి

విద్యార్థులు నిరంతరం
నేర్చుకోవాలి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలని గవర్నర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీ రావు, ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు, వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి ఘనస్వాగతం పలికారు.

6

భారీ వర్షాలు

- వాతావరణ శాఖ హెచ్చరిక
- ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 25 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- పలు ప్రాంతాల్లో నాట్లు నీటమునక



తోట్లవల్లూరు వద్ద కృష్ణానది పాయల్లోకి చేరిన వరద నీరు

మచిలీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఒక మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం 8.30 గంటల వరకు గుడ్లవల్లేరులో అత్యధికంగా 25.4 మిల్లీమీటర్లు, ఉంగుటూరులో అత్యల్పంగా 1.4 మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 6.0 మిల్లీ మీటర్లగా నమోదైంది. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం రాత్రి బ్యారేజీ వద్ద 30 గేట్లను ఒక అడుగుమేర ఎత్తి 25 వేల క్యూసెక్కులకు పైగా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని వదులుతుండటంతో పెనమలూరు, తోట్లవల్లూరు, ఘంటసాల తదితర మండలాల పరిధిలో కృష్ణా నది పాయల్లో వరదనీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. గత వారం రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో పామర్రు, పెదపారుపూడి తదితర మండలాల్లో పొలాల్లోకి వర్షపు నీరు చేరి నాట్లు నీటమునిగాయి. దీంతో ప్రధాన కాల్వలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. దివిసీమ ప్రాంతానికి సాగునీటిని సరఫరా చేసే కేఈబీ కాలువకు కొద్దిగా నీటిని విడుదల చేస్తున్నారు.

- కేంద్ర ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో వేగంగా అడుగులు
- మొదటి దశలో కారిడార్ - 1 గన్నవరం - పీఎన్‌బీఎస్, కారిడార్ - 2 పెనమలూరు సెంటర్ - పీఎన్‌బీఎస్ వరకు 38.40 కిలో మీటర్లు
- ఇంటర్నేషనల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ విధానంలో గ్లోబల్ టెండర్లకు ఆహ్వానం
- తొలి దశ ప్రాజెక్టు అంచనా విలువ రూ.10,118 కోట్లు
- కేంద్ర, రాష్ట్ర వాటా రూ. 4,047.2 కోట్లు
- సీఆర్‌డీఏ నుంచి రూ. 3,497 కోట్లు బదలాయింపు

ఎప్పుడెప్పుడా అని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న మెట్రో రైల్ ప్రాజెక్టు కల ఇక సాకారం కానుంది. కేంద్రం మౌఖిక ఆదేశాలతో మెట్రో రైల్ కార్పొరేషన్ అడుగులు ముందుకు వేస్తోంది. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఇంటర్నేషనల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ విధానంలో గ్లోబల్ టెండర్లను శుక్రవారం పిలవనుంది. తొలి దశలో కారిడార్-1, 2 పరిధిలో- 38.40 కిలో మీటర్ల పనులు జరగనున్నాయి. తొలి దశ ప్రాజెక్టు అంచనా విలువ రూ.10,118 కోట్లు కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ. 4,047.2 కోట్లుగా ఉంది. దీనిలో సీఆర్‌డీఏ నుంచి రూ. 3,497 కోట్లు బదలాయించనున్నారు.



మెట్రో కల సాకారం!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మెట్రో రైల్ ప్రాజెక్టుకు టెండర్లు నేడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మెట్రో రైల్ ప్రాజెక్టు కల ఇక సాకారం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు రావటంతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) శుక్రవారం టెండర్లు పిలవనుంది. ఇంటర్నేషనల్ కాంపిటేటివ్ బిడ్డింగ్(ఐసీబీ) విధానంలో గ్లోబల్ టెండర్లను ఆహ్వానించనుంది. ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన సంస్థలైనా సరే.. మెట్రో ప్రాజెక్టు టెండర్లలో పాలుపంచుకునే అవకాశం కల్పిస్తోంది. మెట్రో ప్రాజెక్టును రెండు దశలలో చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో, తొలి దశలో కృష్ణాజిల్లా గన్నవరం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు ఎన్‌హెచ్ - 16, ఏలూరు రోడ్డు మీదుగా 25.9 కిలోమీటర్ల కారిడార్ - 1, అలాగే కృష్ణాజిల్లా పెనమలూరు సెంటర్ నుంచి ఎన్టీఆర్ జిల్లా పీఎన్‌బీఎస్ వరకు బందరు రోడ్డు మీదుగా 12.45 కిలోమీటర్ల కారిడార్-2 ప్రాజెక్టులకు టెండర్లు పిలుస్తున్నారు. తొలి దశ ప్రాజెక్టు అంచనా విలువ రూ.10,118 కోట్లు కాగా, ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం, రుణంగా 60 శాతం తీసుకుని చేపట్టాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపితే 40 శాతం మేర అంటే రూ. 4,047.2 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంది. కేంద్రం నుంచి ఇంకా అధికారికంగా అనుమతులు రానందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా వ్యయం రూ.4,047.2 కోట్లలో రూ.3,497 కోట్లను సీఆర్‌డీఏ నుంచి తమ వాటాగా ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పిస్తోంది. అధికారిక అనుమతుల తర్వాత కేంద్రం వాటా ఎలాగూ వస్తుంది కాబట్టి ముందుగా చర్యలు చేపట్టింది. అధికారిక అనుమతులు రానప్పటికీ మౌఖిక అనుమతులతోనే ముందుకు వెళ్లాలని ఏపీఎంఆర్‌సీ భావిస్తోంది. ప్రాజెక్టు జాప్యాన్ని నివారించటం కోసం ముందుగా టెండర్లను పిలుస్తోంది. ఆరు నెలల తర్వాత ప్రారంభించే పనిని ఇప్పుడే చేస్తోంది. ఏపీఎంఆర్‌సీ వాదనలను రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏకీభవించటంతో మెట్రో ప్రాజెక్టు టెండర్లకు అడుగులు పడ్డాయి.

ఐసీబీ టెండర్లకు 45 రోజుల గడువు

ఇంటర్నేషనల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ (ఐసీబీ) విధానంలో గ్లోబల్ టెండర్లను పిలుస్తున్న నేపథ్యంలో టెండర్ల గడువును నిబంధనల ప్రకారం 45

మిగతా 6లో..

‘జగనన్న’ కండక్టర్ కట్!

- కాలనీల్లో విద్యుత్ శాఖ సర్వే
- తీగల తొలగింపునకు నిర్ణయం
- నివాసం లేని ఇళ్లలోని మీటర్లు వెనక్కే

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 1051 జగనన్న కాలనీలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో 404, కృష్ణాజిల్లాలో 647 కాలనీలు ఉన్నాయి. వాటిల్లో వేల సంఖ్యలో ప్లాట్లు వేశారు. ఇందులో కొంతమంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఇళ్లను నిర్మించుకునే సామర్థ్యం లేని వారి ఇళ్లను అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్లతో నిర్మాణం చేయించింది. ఈ ఇళ్లకు అవసరమైన విద్యుత్ సదుపాయం కోసం కిలోమీటర్ల కొద్దీ విద్యుత్ స్తంభాలను వేయించారు. అదే స్థాయిలో విద్యుత్ కండక్టర్‌ని

మిగతా 6లో..

వందలాది ఎకరాల్లో వేల ప్లాట్ల లే అవుట్లు వేశారు. చాలీచాలని రహదారులు వేశారు. ఇళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చి వదిలేశారు. ఆర్థిక స్తోమత ఉన్న వారు ఇళ్లు కట్టుకున్నారు. లేని వాళ్లు ఆ ప్లాట్లను అలాగే వదిలేశారు. ఇదీ ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీల పరిస్థితి. ఈ కాలనీల్లో నిర్మించుకునే ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించడానికి స్తంభాలు ఏర్పాటు చేయించి తీగలు (కండక్టర్) వేయించారు. ఈ కండక్టర్‌తోపాటు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని విద్యుత్ శాఖ నిర్ణయించింది. జగనన్న కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించడానికి విద్యుత్ శాఖ సర్వే చేపట్టింది.

మాజేరు వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

6

29, 30 తేదీల్లో మంగినపూడి వద్ద పాస్‌పోర్టుల జారీ

న్యాయమూర్తి బట్టు దేవానంద్‌కు ఘనస్వాగతం

6



ఖరీఫ్ కళ కళ..



ఏతకు సిద్ధంగా ఉన్న వరి నారు

- వర్షాలతో ముమ్మరంగా వరినాట్లు
- మెట్ట పంటలకు ప్రాణం.. వరి నాట్లకు ఊతం
- వ్యవసాయపనుల్లో నిమగ్నమైన అన్నదాతలు

ఇబ్రహీంపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేని వానలతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. ఖరీఫ్ ఎకు ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయి. ఈఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనంగా ఉంది. పట్టిసీమ నుంచి సకాలంలో సాగునీరు విడుదలతో రైతులు వరినారు మళ్ల పోసుకున్నారు. చెరువులకు సాగునీరు చేరింది. బోర్లు, కాలువల కింద పోసిన వరి నారు ఏతకు సిద్ధమైంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నాట్లు ఊపందుకున్నాయి. పట్టిసీమ నీరు, బుడమేరు వరదనీటితో నిండిన చెరువులు కళకళలాడుతున్నాయి. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కందులపాడు, కవులూరు, వెలగలేరు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాధ, రాయనపాడు, గొల్లపూడి, గుంట్లుపల్లి, మూలపాడు, కొటికలపూడి తదితర ఏరియాల్లో వరి నాట్లు వేస్తున్నారు.

మెట్ట పంటలకు జీవం


మెట్ట పంటలకు వర్షాలతో జీవం వచ్చింది. పత్తి పంటకు వర్షం ఊపిరిపోసింది. మైలవరం మెట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున పత్తి సాగవుతోంది. గత వారం వరకు వర్షాలు లేక అల్లాడిన పంటలకు వర్షాలు ప్రాణం పోశాయి. అయితే పల్లపు ప్రాంతాల్లోని పత్తి చేలల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు

వరి నాట్లు ఊపందుకున్న తరుణంలో ప్రస్తుతం పొలాల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు వరి నాట్లు వేస్తున్నారు. నాట్లు వేసినందుకు ఎకరానికి వీరు రూ.4 వేలు తీసుకుంటుంటారు. గత కొనేళ్లుగా వీరు ఈప్రాంతంలో వరి నాట్లు వేస్తున్నారు.



పొంగుతున్న వాగులు, వంకలు



పోలంపల్లి ఆనకట్ట వద్ద వరద నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న లక్ష్మయ్య వాగు



కంచికచర్లరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు వరద నీరు భారీగా చేరింది. రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో చిన్న వాగుల నుంచి భారీగా వరదనీరు లక్ష్మయ్య వాగుకు చేరి చెవిటికల్లు వద్ద రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. చిన్న పాటి వర్షం వచ్చినా లక్ష్మయ్య వాగుకు వరద చేరి రాకపోకలు నిలిచిపోయి చెవిటికల్లు వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెన నిర్మాణానికి హడావిడిగా శంకుస్థాపన చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పోలంపల్లి ఆనకట్ట వద్ద వరద నీరు

వత్సవాయి : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పోలంపల్లి అనకట్ట వద్ద 8.8 అడుగులకు వరదనీరు పొంగి పొర్లుతోంది. ఎగువన వర్షాల కారణంగా మునేరుకు వరద పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఏఈ రామనరసింహ హెచ్చరించారు.



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన వేద పండితులు, అర్చక బృందాలు, ఈవో శీనానాయక్ తదితరులు;

దుర్గగుడిలో ముగిసిన

ఆషాఢ సారె సంబరాలు

- దుర్గమ్మకు కానుకగా రూ.4.25లక్షల హారం



ఇంద్రకీలాద్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాస సారె సంబరాలు ముగిశాయి. గురువారం దేవస్థానంలో పూజలు, హోమాలు, వేదమంత్రాలు తదితరాలతో నిత్యం అమ్మవారికి సేవ చేస్తున్న అర్చక బృందాలు, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు, పరిచారకులు అందరూ కలిసి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ముందుగా అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. సారె సమర్పించి వేడుకున్నారు. ఈవో వీకే శీనానాయక్ అర్చక బృందాల తరఫున అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం దుర్గమ్మకు రూ.4.25లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు.

ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో అర్చక బృందాలు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. ఆరోజున అమ్మవారు వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తారు. భక్తుల కోసం ఆగస్టు 22వ తేదీ శుక్రవారం ఉదయం మొదటి షిఫ్టులో రూ.1500లు రుసుముతో ఆర్జిత సేవ కింద సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. తర్వాత ఉదయం 10 గంటల నుంచి రెండో షిఫ్టులో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. ఆగస్టు 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తారు. ఆగస్టు 8 నుంచి 10వ తేదీ వరకు యాగశాలలో మూడురోజుల పాటు శ్రాస్త్రోక్తంగా పవిత్రోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు.



స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలి

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ఉంగుటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నిరంతరం ఉన్నతంగా ఎదగాలని గవర్నర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. గురువారం ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌కు విచ్చేసిన గవర్నర్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం లభించింది. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, స్వర్ణభారత్‌ట్రస్ట్ చైర్మన్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తదితర ప్రముఖులు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

ఏపీజే అబ్దుల్‌కలాం నైపుణ్య శిక్షణాకేంద్రం సందర్శన

గవర్నర్ ట్రస్ట్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నైపుణ్య శిక్షణాకేంద్రాన్ని సందర్శించి అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం శిక్షణాకేంద్రంలోని ప్లంబింగ్, శానిటరీ ప్రయోగశాల, విద్యుదీకరణ ప్రయోగశాల, సౌరశక్తి శిక్షణకేంద్రం, కారు, బైక్ మెకానిక్ శిక్షణాకేంద్రాలను పరిశీలించారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి

గంజాయి భూతం వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే..

- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయి విక్రయాలను ప్రోత్సహించి యువత భవిష్యత్‌ను నాశనం చేసిందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం 'గంజాయిని నిర్మూలిద్దాం యువతను కాపాడుకుందాం' నినాదంతో పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రంలో గంజాయిని ఆదాయవనరుగా మార్చుకుని అక్రమ సంపాదనే ధ్యేయంగా యువతను మత్తుకు బానిసలు చేశారన్నారు. యువత మత్తుపదార్థలకు దూరంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత సారథ్యంలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మాజేరు వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

చల్లపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం కొత్తమాజేరు లింగన్నకోడు వంతెనపై రాకపోకలను గురువారం సాయంత్రం పునరుద్ధరించారు. గుండేరులో నీటిప్రవాహం అధికంగా ఉండటం, ఎగువనుంచి గుర్రపుడెక్క వంతెన వద్ద మేటవేయడంతో నీటి ఉధృతికి వంతెన అప్రోచ్ రహదారి దిగువభాగంలో ఊల పడి తారురోడ్డు కుంగి భారీ గండి పడిన విషయం తెలిసిందే. కొండరాళ్లతో గండిని పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా కొండరాళ్లను పోసి గండిని పూడ్చి రాకపోకలను పునరుద్ధరించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, డైరెక్టర్లు జంధ్యం కోటేశ్వరమ్మ, కోలపల్లి శ్రీవర్ష, నేతలు తదితరులు పనులను పర్యవేక్షించారు. వంతెన వద్ద గండిపడిన ప్రాంతాన్ని ఉదయం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. అధికారులతో చర్చించారు. గండిని పూడ్చటంతోపాటు వంతెనకు ఇరువైపులా రివిట్‌మెంట్ ను పటిష్టపరిచి మరోసారి కోతకు గురికాకుండా చూడాలని సూచించారు.



మాజేరు గండి పూడ్చిన అనంతరం రహదారిపై ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, కూటమి నేతలు

రహదారికిరువైపులా పటిష్ట చర్యలు చేపట్టాలి

గండి పూడ్చినప్పటికీ రహదారికి ఇరువైపులా పటిష్టచర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రహదారిపై మలుపులో ప్రమాదాలు జరగకుండా పక్కనే కొండరాళ్లను పోసి రోడ్డు కోతకు గురికాకుండా పటిష్టపరచాలి. వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలనే ప్రజల విజ్ఞప్తులపై అధికారులు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'జగనన్న' కండక్టర్ కట్!

(5వ పేజీ తరువాయి)

అమర్చారు. కొన్ని కాలనీల్లో ప్రత్యేకంగా సబ్ స్టేషన్లు నిర్మించారు. ఇక్కడ ఉండే నివాసితుల విద్యుత్ వినియోగం మేరకు ఓల్టేజ్ హెచ్చుతగ్గులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కాలనీలో పది నుంచి 20కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు అక్కడ నివసించడానికి ఇష్టపడడం లేదు. మరి కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టి మధ్యలో ఆపేశారు. కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లలో నివసించడానికి లబ్ధిదారులు ఆసక్తిని చూపడం లేదు. తక్కువ సంఖ్యలో మాత్రం సొంతంగా ఇళ్లను నిర్మించుకున్న వారు అక్కడ నివసిస్తున్నారు. మొత్తంగా జగనన్న కాలనీలను ఒక యూనిట్‌గా తీసుకుంటే నివసించే వారి సంఖ్య తక్కువగాను, ఖాళీగా ఉన్న ప్లాట్లు ఎక్కువగాను కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న విద్యుత్ తీగలను, ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు మాయం చేస్తున్నారు. ఒక స్తంభానికి మరొక స్తం భానికి మధ్య ఉన్న తీగ రోజురోజుకు మాయమవుతున్నా యి. దిమ్మలపై ఉండాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు ఎగిరిపోతున్నా యి. దీనితో ట్రాన్స్‌కో అధికారులు తొలగింపు నిర్ణయం తీసుకున్నారు. జగనన్న కాలనీలో ఖాళీగా ఉన్న విద్యుత్ తీగలను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఎస్‌ఈలకు ఆదేశాలు ఇచ్చారు. దీనితో ఉమ్మడి జిల్లాలో సబ్‌స్టేషన్ల వారీగా జగనన్న కాలనీల్లో విద్యుత్ శాఖ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఒక్కో కాలనీలో ఎన్ని వీధుల్లో లబ్ధిదారులు నివసిస్తున్నారు? ఇళ్ల నిర్మాణం ఎంత వరకు జరిగింది? ఎన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు? లెక్కలను తీస్తున్నారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే సాగుతోంది. ఈ సర్వే పూర్తయిన తర్వాత లబ్ధిదారులు లేని ప్రాంతాల్లో విద్యుత్ తీగలను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని నిర్ణయించారు.

మీటర్లూ తొలగింపు

కొన్ని కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుని విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. ఆ ఇళ్లకు విద్యుత్ అధికారులు మీటర్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు కొద్దిరోజులు మాత్రమే అక్కడ నివసించారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ ఇళ్లకు ప్రస్తుతం విద్యుత్ బిల్లులు కనీస ఛార్జీలతో వస్తున్నాయి. జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఎవరు నివాసం లేకపోతే ఆ ఇంటి మీటర్లను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. దీనిపైన సర్వే సాగుతోంది. ఈ సర్వేలు పూర్తయిన తర్వాత జగనన్న కాలనీల్లో కిలోమీటర్ల కొద్దీ వేసిన కండక్టర్‌ను తొలగించాలని రంగం సిద్ధం చేసుకున్నారు. విద్యుత్ స్తంభాలను మాత్రం అలాగే ఉంచేసి ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలను తొలగించడానికి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

రుద్రవరం కాలనీ రోడ్డును అమ్మేశారు

(5వ పేజీ తరువాయి)

భూమితోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొందరు ఈ భూమి తమ ఆధీనంలోనే ఉందని, భవిష్యత్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమకున్న రాజకీయ పలుకుబడితో అధికారులతో మాట్లాడుతామని చెప్పి ప్రభుత్వ భూములను విక్రయించేస్తున్నారు. ఈ కాలనీ ఐదో రోడ్డులో చివరి ప్రాంతంలో రహదారికి కేటాయించిన స్థలంతోపాటు మరి కొంత ప్రభుత్వ స్థలాన్ని మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించేశారు. కృష్ణాయూనివర్సిటీకి అత్యం త సమీపంలో ఉన్న ఈ స్థలానికి భవిష్యత్‌లో మరింత రేటు పెరుగుతుందని నమ్మించి, మూడు లక్షల రూపాయల నగదును అడ్వాన్సుగా తీసుకున్న రియల్ ఎస్టేట్, ఈ స్థలం మీదేనంటూ కాగితాలు కూడా రాసి ఇచ్చారు. త్వరలో రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తామని నమ్మించారు.

చదును చేసి ఆక్రమణ

రుద్రవరం లేఅవుట్ పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి నాలుగు రోజుల క్రితం ఎక్స్‌కవేటర్ తెచ్చి ఈ స్థలంలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి చదును చేశాడు. చదును చేసే సమయంలో స్థానికంగా స్థలాలు విక్రయించే ముఠా సభ్యులు దగ్గరుండి మరీ రహదారికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి పనులు చేయించడం గమనార్హం. కాలనీచుట్టూ రహదారి వేసేందుకు అంచనాలు రూపొందించారని, రహదారి నిమిత్తం కేటాయించిన స్థలాన్ని ఎలా కొనుగోలు చేసి, ఆక్రమిస్తారని స్థానికులు ప్రశ్నిస్తే, వారిపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు దిగారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు గురువారం సంఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఇక్కడ ఎలాంటి కట్టడాలు నిర్మాణం చేయకూడదని హెచ్చరించారు.

గతంలో రెండు ఎకరాల డ్రైయినేజీ భూమి..

రుద్రవరం లేఅవుట్ పక్కనే ఉన్న బొంబాయి కాల్వ డ్రెయినేజీ భూమిని ఆక్రమించేసి గతంలో రొయ్యల చెరువుగా తవ్విన అక్రమార్కులు దానిని లీజుకు ఇచ్చారు. ఈ అంశంపైన రెవెన్యూ అధికారులకు స్థానికుల నుంచి అప్పట్లో ఫిర్యాదులు అందడంతో చెరువును ఖాళీ చేయించారు. ప్రభుత్వ భూమిని రొయ్యల చెరువుగా తవ్వించిన వారే రహదారికి కేటాయించిన భూమిని విక్రయించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వీఆర్వోలు పరిశీలించారని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని హెచ్చరికలు జారీచేశారని మచిలీపట్నం దక్షిణ మండల తహసీల్దార్ మధుసూదనరావు తెలిపారు.



మెట్రో కల సాకారం

(5వ పేజీ తరువాయి)

రోజులుగా నిర్దేశించారు. ఈ 45 రోజుల వ్యవధిలో కాంట్రాక్టు సంస్థల సందేహాలను తీర్చటానికి పలుమార్లు ఆయా సంస్థలతో ఏపీఎంఆర్‌సీ ఎప్పటికప్పుడు సమావేశమవుతుంది. కాంట్రాక్టర్ల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళతుంది. అంతర్జాతీయంగా ఏ సంస్థ అయినా ఈ టెండర్లలో పాలు పంచుకోవచ్చు. టెండర్లను ఖరారు చేస్తారు. పనులు ప్రారంభం కావాలంటే మరో ఆరు నెలల సమయం పడుతుంది. ఎందుకంటే కొన్ని సర్వేలను చేపట్టాల్సి ఉంటుంది. ఈ లోపు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులతో పాటు మిగిలిన 60 శాతం రుణ వ్యవహారాలు కూడా ఒక కొలిక్కి రానున్నాయి. ఇవన్నీ పూర్తయ్యే వరకు టెండర్లు ఆపితే జాప్యం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో ముందే పిలవటం జరుగుతోంది.

టోపో సర్వే తప్పనిసరి

టెండర్ల ప్రక్రియతో పాటు సమాంతరంగా కీలకమైన పనులు క్షేత్ర స్థాయిలో ఆరు నెలల పాటు జరగనున్నాయి. వీటిలో టోపో సర్వే ముందుగా నిర్వహిస్తారు. నిర్మాణ పనుల సందర్భంగా ఖచ్చితంగా చేపట్టాల్సి ఉంటుంది. భూమి స్వభావాన్ని అర్థం చేసుకోవటమే టోపే సర్వే ఉద్దేశ్యం. ప్రాజెక్టు కారిడార్ల స్థలంలో ఎత్తు, వాలు, ఇతర లక్షణాలను అధ్యయనం చేస్తారు. టోపో సర్వే ద్వారా ఇళ్లు, రోడ్లు, ఇతర నిర్మాణాలను గుర్తించి వాటికి పెద్దగా నష్టం జరగకుండా చూస్తారు. ఖచ్చితమైన ప్లానింగ్‌తో ముందుకు వెళతారు. ఆ తర్వాత పిల్లర్స్ జియో టెక్నికల్ సర్వే నిర్వహిస్తారు. ప్రతి పిల్లర్‌కు ఈ సర్వే నిర్వహిస్తారు. క్యాస్టింగ్ యార్డును సిద్ధం చేసుకోవటం, కలెక్టర్‌తో సమావేశాలు నిర్వహించటం, ట్రాఫిక్ పోలీసులతో సమావేశాలు నిర్వహించి ట్రాఫిక్ డైవర్షన్స్ చేపట్టడం, సైన్ బోర్డుల ఏర్పాటు వంటివి పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది.

> ## మెట్రో స్టేషన్లు ఇవే..
>
> **కారిడార్ - 1 (గన్నవరం - పీఎన్‌బీఎస్):** గన్నవరం బస్‌స్టేషన్, గన్నవరం సెంటర్, యోగాశ్రమం, ఎయిర్‌పోర్టు స్టేషన్, కేసరపల్లి, వేల్పూరు, గూడవల్లి, శ్రీచైతన్య కాలేజీ, నిడమానూరు రైల్వేస్టేషన్, నిడమానూరు, ఎనికేపాడు, ఎంబీటీ సెంటర్, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, గుణదల, పడవలరేవు, మాచవరం డౌన్, సీతారామపురం సిగ్నల్, బీసెంట్ రోడ్డు, రైల్వే స్టేషన్ (ఈస్ట్), రైల్వేస్టేషన్ (సౌత్) స్టేషన్లు ఉన్నాయి.
>
> **కారిడార్-2 (పెనమలూరు సెంటర్ - పీఎన్‌బీఎస్):** పెనమలూరు, పోరంకి, తాడిగడప, కానూరు సెంటర్, కృష్ణ నగర్, అశోక్‌నగర్, ఆటోనగర్, బెంజ్‌సర్కిల్, టిక్కిల్ రోడ్డు, మునిసిపల్ స్టేడియం, విక్టోరియా జూబిలీ మ్యూజియం, పీఎన్‌బీఎస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

80 ఎకరాల భూ సేకరణ

మెట్రో ప్రాజెక్టుకు టెండర్లు పిలుస్తున్న నేపథ్యంలో తక్షణం ఎన్టీఆర్, కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగాలు భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించనున్నాయి. మెట్రో ప్రాజెక్టు కోసం మొత్తంగా 80 ఎకరాల భూములు అవసరమని ఏపీఎంఆర్‌సీ ప్రతిపాదించింది. ఇందులో 60 ఎకరాలు కృష్ణా జిల్లా గన్నవరం దగ్గర కోచ్ డిపోకు అవసరమవుతున్నాయి. మిగిలిన 20 ఎకరాలు ఎన్‌హెచ్-16, ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు వెంబడి మెట్రో స్టేషన్లకు భూములు కావాల్సి ఉంది.

ఏఐఐబీ నుంచి రుణ ప్రయత్నాలు కొలిక్కి!

మెట్రో ప్రాజెక్టుకు మిగిలిన 60 శాతం నిధులను రుణంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రుణాన్ని ఏఐఐబీ నుంచి తీసుకోవాలని భావిస్తోంది. తక్కువ వడ్డీ, ఎక్కువ కాలం సమయం, షరతులు లేని విధంగా రుణం ఇస్తున్నందున ఈ సంస్థ నుంచి తీసుకోవాలని ఏపీఎంఆర్‌సీ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు వస్తే ఈ సంస్థ రుణం ఇస్తుంది. టెండర్లు ఖరారు చేయటంతో పాటు, బ్యాలెన్స్ సర్వే పనులు పూర్తయ్యేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.



గన్నవరం విమానాశ్రయం నుంచి వస్తున్న హైకోర్టు జడ్జి బట్టు దేవానంద్

హైకోర్టు న్యాయమూర్తికి

గన్నవరంలో ఘనస్వాగతం

గన్నవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. చెన్నై నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి గురువారం సాయంత్రం ఆయన విచ్చేశారు. జిల్లా జడ్జి గోపీనాథ్, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానంద్, గన్నవరం ప్రోటోకాల్ జడ్జి ఎన్.గాయత్రి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, తహసీల్దారు కేవీ శివయ్య, ఎయిర్‌పోర్టు డీఎస్పీ పి.మురళీ రామకృష్ణ పలువురు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పూల బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు. ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

సీఎంను కలిసిన బుద్ధప్రసాద్



అవనిగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆగస్టు 4 నుంచి ఏడాదిపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి హాజరవుతానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు బుద్ధప్రసాద్ పేర్కొన్నారు.

29, 30 తేదీల్లో మంగినపూడి వద్ద పాస్‌పోర్టులు జారీ

- ఎండీవో ఆఫీసులో రిజిస్ట్రేషన్ కౌంటర్


మచిలీపట్నం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వెళ్లకుండానే మొబైల్ పాస్‌పోర్టు సేవా కేంద్రం ద్వారా ఈనెల 29, 30 తేదీల్లో మంగినపూడి లైట్‌హౌస్ వద్ద పాస్‌పోర్టులు జారీ చేయనున్నట్టు ఎండీవో వెంకటేష్ తెలిపారు. పాస్‌పోర్టు కావలసిన వారు తమ వివరాలను 25, 26 తేదీల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఆధార్, పాన్, ఓటరు ఐడీ, టెన్త్ సర్టిఫికెట్, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్‌తో పాటు రూ. 1500 పాస్‌పోర్టు దరఖాస్తుకు చెల్లించాలన్నారు. వివరాలకు 7893601268 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్లకు ప్రవేశపరీక్ష రాసి సీట్లు పొందని, ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటూరు, బల్లిపర్రు, రుద్రవరం, పామర్రు, తిరువూరు, కృష్ణరావుపాలెం పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఖాళీలు ఉన్న పాఠశాలల్లో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఐవీఎఫ్ వైద్యచరిత్రలో మైలురాయి

- ప్రముఖ ఫెర్టిలిటీ వైద్యురాలు సుకీర్తి ఏలూరి



విజయవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ గర్భధారణ చికిత్స(ఐవీఎఫ్) వైద్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయిందని డాక్టర్ సుకీర్తి ఏలూరి తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఐవీఎఫ్ డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత ప్రపంచంలో సంతానలేమి సమస్య సాధారణమైపోయిందన్నారు. జీవనశైలిలో మార్పులు, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత, ఆరోగ్య సమస్యలతో చాలామంది దంపతులు పిల్లల కోసం ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ఐవీఎఫ్ సురక్షితమైన, ప్రతిభావంతమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఈవిధానం ద్వారా ఆడవారిలో గర్భసంచివాపు, పుట్టుకతో గర్భసంచి సమస్యలు, హార్మోన్ల సమస్య ఉన్నవారికి సంతానం కలిగించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మగవారిలో వీర్యకణాల సంఖ్య తగ్గడం, హార్మోన్ల సమస్యతో బాధపడేవారు ఈ విధానంతో సమస్యను అధిగమించవచ్చన్నారు. దేశంలో ప్రతి పదిమందిలో నలుగురు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారని డాక్టర్ సుకీర్తి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరు మార్పుకు ప్రతిపాదన

● ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాల స్వీకరణ మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ వెల్లడి

కానూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్పు ప్రతిపాదనకు ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ ఈమేరకు నోటిఫికేషన్ విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలు ఉంటే నెల రోజుల లోపు తెలియజేయాలని ఆయన కోరారు. సూచనలు, అభ్యంతరాలను ప్రజలు రాతపూర్వకంగా సమర్పించాలని, నివాసి పూర్తి పేరు, చిరునామాతోపాటు అభిప్రాయానికి గల స్పష్టమైన కారణాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అభిప్రాయాలు స్వీకరించి ప్రభుత్వానికి పంపుతామని వాటి ఆధారంగా తుది నిర్ణయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.





గన్నవరం గ్రంథాలయంలో, తేలప్రోలు గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పాఠకులు

ఆదర్శనీయుడు అయ్యంకి వెంకట రమణయ్య

గన్నవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య ఆదర్శనీయులని అని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కె.సువార్తరాణి అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్రను పోషించాయన్నారు. గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, ఉపాధ్యాయినీ లతా, కోటేశ్వరరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి వేడుకలు గురువారం తేలప్రోలు గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం వక్తలు మాట్లాడారు.

ఈకార్యక్రమంలో పెద్దలు తియ్యగూర వెంకటరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గుడిబండ శ్రీహరి, వజ్రాల శివారెడ్డి, దేవిరెడ్డి ముత్తారెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి, సిరివాడ రామసాయి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టం ఎక్కడుంటే అక్కడుంటా

కానూరు మెయిన్‌రోడ్డు మరమ్మతు పనులు చేయించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కానూరు మెయిన్‌రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): కష్టం ఎక్కడుంటే అక్కడుంటా... బాధ ఎక్కడుంటే అక్కడుంటా అంటూ పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. రెండు రోజులుగా కురిచిన భారీ వర్షాలకు తాడిగడప మున్సిపాలిటీ కానూరు మెయిన్‌రోడ్డులోని పలు ప్రాంతాల్లో రెండు నుంచి మూడు అడుగులు నీరు నిలిచి జనజీవనం అస్తవ్యస్తంగా మారడంతో ఎమ్మెల్యే నడుంబిగించారు. ఆయన బుధవారం రాత్రి వరకు మెయిన్‌రోడ్డు పనులు చేయించి, గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు ఆక్రమణలకు గురవడంతో నీరు రోడ్డుపైకి వచ్చి మునిగిపోయిందన్నారు. డ్రెయినేజీ ఆక్రమణలను తొలగింపజేసి మురుగునీరు సక్రమంగా వెళ్లే విధంగా కృషి చేశామన్నారు. వర్షానికి దెబ్బతిన్న మెయిన్‌రోడ్డుకు మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు.



చౌడేశ్వరీదేవికి ఆషాఢ సారె సమర్పిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ పాలడుగు బాలాజీ, మాధవి దంపతులు, దేవాంగుల భక్తబృందం

చౌడేశ్వరీదేవికి ఆషాఢ సారె

ఉయ్యూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముదునూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చౌడేశ్వరిదేవికి ఆలయ మాజీ చైర్మన్ పాలడుగు బాలాజీ, మాధవి దంపతులు, నాగులపల్లి భాస్కరరావు దంపతులు, కప్పలదొడ్డి వాస్తవ్యులు పెడన దేవాంగులు భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ముస్తాబాదలో విరాళాలు సేకరిస్తున్న కౌలు రైతులు సంఘం నాయకులు

క్యూబాకు సంఘీభావం తెలపండి

గన్నవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మానవత్వంతో క్యూబాకు సంఘీభావం తెలుపుతూ అమెరికా సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తెలిపారు. మండలంలోని ముస్తాబాదలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ నిధిని గురువారం సేకరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, సేకరించిన రూ. 4300 రాష్ట్ర కమిటీకి పంపించినట్లు తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, కైలే ఏసుదాసు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

సమీక్షా సమావేశంలో ఎంపీడీవో జ్యోతి

పామర్రు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన అంశాలను అవగాహన చేసుకుని గ్రామ సచివాలయ ఉద్యోగులు సామర్థ్యాలు, నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ఐగాట్ కర్మయోగి ఎంతోగానో దోహదపడుతుందని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులుతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశించిన సమగ్ర సర్వేలను వేగవంతంగా పూర్తిచేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేలా సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.కిషోర్, పంచాయతీ కార్యదర్శులు సలీం, పద్మశ్రీవేణి, పూర్ణచంద్రరావు, అంజినాదేవి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు, కుర్చీలు, టేబుల్స్ అందజేత

పామర్రు: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐడీబీఐ జోనల్ మేనేజర్ ఎం.జానకీరామ్ అన్నారు. పామర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఐదు వందల మధ్యాహ్న భోజనం ప్లేట్స్, 25 కుర్చీలు, 20 టేబుల్స్, పది ఫ్యాన్లు ఇతర సామగ్రి గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి సామాజిక బాధ్యతగా తీసుకుని తమ బ్రాంచ్ కృషిచేస్తుందన్నారు. రీజినల్ మేనేజర్ సాయికృష్ణ, ఉయ్యూరు మేనేజర్ కె.అనుదీప్‌సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతలమయం కాటూరు-కుందేరు రోడ్డు



ఉయ్యూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కాటూరు- కుందేరు అర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా తయారై వాహనాల రాపోకలకు ఇబ్బందికరంగా ఉంది. కుందేరు నుంచి కాటూరు మీదుగా ఉయ్యూరు మండల పరిధి గ్రామాలతో పాటు పెదపారుపూడి మండలంలో గ్రామాలకు వెళ్లే రోడ్డులో పొడవునా పెద్ద గుంతలు ఏర్పడి వర్షాలకు నీరు నిలిచి ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామాలలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో పొలం పనులకు వెళ్లే వారికి ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చించాలని కోరుతున్నారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్యఅప్పారావుపేట కోదండ రామాలయంలో స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు బాదంపూడి రామకృష్ణ అరుణ్‌కుమార్ స్వామికి పంచామృతాభిషేకం, పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం 9 సార్లు మణిద్వీప వర్ణన పారాయణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు పరుచూరి సుకన్య, పొట్లూరి నాగమల్లేశ్వరి, కొల్లిపర రత్నమాణిక్యం, లింగం జ్యోతి, గ్రామ ప్రముఖులు పొట్లూరి సీతారాం ప్రసాద్, పరుచూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి ధనశ్రీ

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నూతన కార్యవర్గం

ఉంగుటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నూతన కార్యవర్గం కృషిచేయాలని సీఐటీయూ శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి ధనశ్రీ సూచించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల మహాసభ గురువారం ఉంగుటూరులోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ధనశ్రీ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిపారు. వంట ఏజెన్సీల సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా కడవకొల్లు రామరాజు, అధ్యక్షుడిగా సయ్యద్ మహబూబి, కార్యదర్శిగా చిరికి లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ, కోశాధికారిగా సుమతి, కమిటీ సభ్యులుగా నాగలక్ష్మి, చంటి, భవాని, రంగనాయకమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో కౌలురైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వంట ఏజెన్సీల కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.సునీల్

సహజ వ్యవసాయమే మేలు

వ్యవసాయ సహాయ సంచాలకులు సునీల్

గన్నవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతులను సహజ వ్యవసాయానికి మార్చేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.సునీల్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో గురువారం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల పరిధిలోని ఉద్యాన సహాయకులకు ప్రకృతి సేద్యపు వ్యవసాయ పద్ధతులపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంతో రైతుల ఆదాయాన్ని పెంచటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు.శ్రీనివాస్, సులోచన, పద్మ, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఉంగుటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ వివరాల ప్రకారం పెదఅవుటపల్లి వద్ద హైవే మార్జిన్‌లో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (50) అపస్మారక స్థితిలో పడివున్నాడన్న సమాచారంతో పోలీసులు వచ్చి అతడిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. అతడి భౌతికకాయాన్ని విజయవాడ జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. కాగా సదరు వ్యక్తి గత రెండురోజుల నుంచి ఒంటిపై దుస్తులు లేకుండా పెదఅవుటపల్లి గ్రామంలో భిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లుగా పోలీసుల విచారణలో తెలిసింది. మృతుడి ఎడమవైపు ఛాతిపై రేఖా అనే ఇంగ్లీషు అక్షరాలతో వేయించుకున్న పచ్చబొట్టు వుందని, చొక్కా లేకుండా, జీన్స్ క్లాత్ నిక్కరు ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. వివరాలు తెలిసినవారు ఎస్సై నెంబర్ 9491152837లో సంప్రదించాలని సూచించారు.



గ్రామంలో అవగాహన కల్పిస్తున్న డీపీవో లావణ్యకుమారి

స్వర్ణరథం ప్రాజెక్ట్ అమలుకు ఏర్పాట్లు

డీపీవో లావణ్యకుమారి

విజయవాడ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : స్వర్ణరథం ప్రాజెక్ట్ అమలుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా గ్రామ పంచాయితీ అధికారి(డీపీఓ) లావణ్య కుమారి అధికారులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గురువారం ఆమె విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా స్వర్ణ రథం ప్రాజెక్ట్ గురించి అధికారులతో పాటుగా ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణలో భాగంగా ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించడం జరుగుతుందని, సదరు ప్లాస్టిక్‌కు నిత్యావసర సరుకులు ఇచ్చే విధంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా నున్న గ్రామంలో అమలు పరుస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణ గ్రామ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నులు వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో విజయవాడ రూరల్ మండలం డిప్యూటీ ఎంపీడీవో ఎం. వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె. సురేష్‌బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సంపద తయారీ కేంద్రాలు పరిశీలన, సేవలపై ఆరా

కూచిపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా సర్వే బృంద ప్రతినిధులు మొవ్వ పంచాయతీ పరిధిలోని పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సంపద తయారీ కేంద్రాలు పరిశీలించి వివరాలు సేకరించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నాయా? లేదా, వాటి నిర్వహణ ఎలా ఉంది, మచినీటి సౌకర్యం తదితర అం శాలు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలు గృహాలను సంద ర్శించి తడి, పొడి చెత్తకు సంబంధించిన డస్ట్ బిన్లు ఉపయోగిస్తున్నారా? పరిసరాల పరిశు భ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు జి.రవి వర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధి కె.పవన్, జిల్లా పంచాయతీ ప్రతినిధి వెంకటరత్నం, ఈవోపీఆర్డీ పరమాత్మ, సర్పంచ్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పమిడిముక్కల: తాడంకి, గురజాడ, వేల్పూరు గ్రామాల్లో బృందం పర్యటించి ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు, సచివా లయాల్లో సేవలపై ఆరాతీసి రికార్డులు పరిశీలించారు. గృహయజమానులతో మాట్లాడి వివరాలు నమోదుచేశారు. పారిశుధ్యం, మరుగు దొడ్ల నిర్వహణ, మురుగుకాల్వల సమస్యపై క్షేత్రస్థాయిలో పరిలించి సర్వే ఆవశ్యకతను ప్రజ లకు వివరించారు. ఎంపీడీవో వి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి భవాని, సర్వే కో-ఆర్డినేటర్లు బాపూజి ఏసుబాబు, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి పాల్గొన్నారు.

పామర్రు: కేంద్రబృందం గురువారం పామర్రు పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయం ప్రాంతంలోని ప్రభుత్వ సంస్థలతోపాటు, పలుగృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాంద్రుజ్యోతి, ఎడ్యుకేషన్, వేల్ఫేర్ సహాయకురాలు బి.పల్లవి, డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండో-అమెరికన్ ఒప్పందం రైతులకు తీవ్ర నష్టం

- ఆగస్టు 13న నిరసనలను విజయవంతం చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

గాంధీనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇండో-అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఆగస్టు 13న జరిగే నిరసనల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర రైతులకు పిలుపునిచ్చింది. స్థానిక దాసరిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. ఇండో-అమెరికన్ ఒప్పందాలతో దేశంలో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని, పాలు, పౌల్ట్రీ, అపరాల రైతులు, మామిడి, పామాయిల్, ఆక్వా, పుప్పుధాన్యాలు పండించే రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతు, కౌలురైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రద్దు చేసిన ఉచిత పంట బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. రాష్ట్ర కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు పాల్గొన్నారు.

సైబర్ క్రైం ఏసీపీగా రాజశేఖర్



విజయవాడ సిటీ, జూల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా బీ రాజశేఖర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా మహిళా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పని చేసిన ఆయన బదిలీపై విజయవాడ సైబర్ స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం సీపీ ఎస్వీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

తిరుపతి - సాయినగర్ షిరిడీ మధ్య 20 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - సాయినగర్ షిరిడీ మధ్య నెలకొన్న ప్రయాణికుల అదనపు రద్దీ నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే 20 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నదని సీపీఆర్వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07637 తిరుపతి - సాయినగర్ షిరిడీ రైలు తిరుపతిలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు షిరిడీ సాయినగర్ చేరుకుంటుంది. ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 28 వరకు ఈ రైలు నడుస్తుంది. 07638 సాయినగర్ షిరిడీ - తిరుపతి రైలు సోమవారం రాత్రి 7.35కు బయలుదేరిన రైలు మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుపతి చేరుతుంది. ఈ రైలు ఆగస్టు 4 నుంచి సెప్టెంబరు 29 వరకు కొనసాగుతుంది. 01438 ధర్మవరం - షోలాపూర్ రైలు శనివారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి ఆదివారం 10.45కు షోలాపూర్ చేరుతుంది. ఈ రైలు ఈనెల 26న నడుస్తుంది. తిరుపతి - సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ 18 సర్వీసులు నడుస్తుంది. రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, బల్కి, ఉద్గిరి, లాతూర్ రోడ్డు, పర్లి, గంగాఖేర్, పర్బనీ, సెలు, జల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపెరగాం స్టేషన్లలో ఆగుతుంది. షోలాపూర్ - ధర్మవరం రైలు ఖుద్దువాడీ, బార్సి టౌన్, ధరసివ్‌లాతూర్, లాతూర్‌రోడ్డు, ఉద్గిరి, బల్కి, బీదర్, హోమ్నాబాద్, కరబుర్గి, వాడి, యాద్గిర్, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపర్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట్, రేణిగుంట, తిరుపతి, పాకాల, ఈలేరు, మదనపల్లిరోడ్డు, ములకలచెరువు, కదిరి స్టేషన్లలో ఆగుతుంది.

ఐటీఐలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ పొడిగింపు

భారతీనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్లభర్తీకి గురువారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన 2వ విడత కౌన్సెలింగ్‌లో 2వ రోజు 229 మంది విద్యార్థులు హాజరయ్యారు వారిలో 184 మంది విద్యార్థులకు వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు కేటాయించినట్టు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హాజరుకాని అభ్యర్థులకు కౌన్సెలింగ్ రేపు

బుధ, గురువారం రెండు రోజుల పాటు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన 2వ విడత కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులకు శనివారం ఉదయం 8 గంటల నుంచి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించబడుతుందన్నారు. 8వ తరగతి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.





ఖిల్లాపై చల్లగా..

ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. వర్షాన్ని కుమ్మరించేందుకు రెడీగా ఉండగా, పత్తి పంటతో భూమిపై పచ్చదనం పరుచుకుంది. వర్షాకాలంలో మనసుకు ఆహ్లాదాన్నిచ్చే అద్భుతాలు అప్పుడప్పుడూ ఆవిష్కరిస్తుంటాయిలా.. నిన్న, మొన్నటి వరకు కళతప్పిన కొండపల్లి రిజర్వు ఫారెస్టులోని కొండపల్లి ఖిల్లా కొండలు వర్షాలకు చిగురించి పచ్చదనంతో అలరిస్తున్నాయి. మేఘాలు ఖిల్లాపైనున్న టీవీ టవర్‌ను కమ్మేశాయి. ఎర్రబిడ్జిపై నుంచి చూస్తే కొండపల్లి ఖిల్లా కొండల దృశ్యాలు ఎంత బాగున్నాయో కదా..! - ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి

భగ్గుమంటున్న బంగారం

వేడేక్కుతున్న వెండి ● వారం క్రితం తగ్గినట్టే తగ్గి.. మళ్లీ దూకుడు ● సామాన్య, మధ్య తరగతికి అందనంత ఎత్తులో పుత్తడి

అంతర్జాతీయంగా పెరిగిన భౌగోళిక ఉద్రిక్తలు బంగారం, వెండి ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గృహ, శరీర అలంకర లోహాల ధరలు వారం క్రితం తగ్గినట్లే తగ్గి, తాజాగా దూకుడు పెంచాయి. ఈ నెల 22 నుంచి ఊపందుకున్న వీటి ధరలు పేద, మధ్య తరగతి ప్రజల అలంకరణ ఆశలపై నీళ్లు జల్లాయి. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసం శుభముహుర్తాలపై ధరల ప్రభావం పడే అవకాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ:



అంతర్జాతీయంగా బ్యాంకులు బంగారం నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నించడం, లోహాలపై పెట్టుబడులు సురక్షితం అనే భావనకు ప్రజలకు రావడం, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పెరగడం బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. విజయవాడ మార్కెట్‌లో ఈ ఏడాది మే 30న 10 గ్రాముల 24 క్యారెట్‌ల గోల్డ్ ధర రూ.95,320, 22 క్యారెట్‌ల గోల్డ్ రూ. 87,377గా ఉంది. కేజీ వెండి ధర రూ.97,190గా ఉంది. జూన్ 20 నాటికీ 24 క్యారెట్ గోల్డ్ రూ.1.01 లక్షకు, 22 క్యారెట్ గోల్డ్ రూ. 92,660కు చేరగా, కేజీ వెండి రూ. 1.29 లక్షలకు గరిష్ట స్థాయికి ఎగబాకింది. అక్కడ నుంచి తగ్గుముఖం పడుతూ జూన్ 30 నాటికి 24 క్యారెట్ గోల్డ్ రూ.97,560, 22 క్యారెట్ గోల్డ్ రూ. 89,440, కేజీ వెండి రూ.1.07 లక్షలకు పడిపోయింది. తరువాత 15 రోజుల పాటు అంతర్జాతీయ పరిస్థితులు యుద్ధాల వైపు మెగ్గు చూపడంతో వీటి ధరల్లో కనిపించిన స్వల్ప తగ్గుదల సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఊరట నిచ్చాయి. జూలై 15 నుంచి మళ్లీ క్రమంగా పెరుగుదల కనిపిస్తోంది. ఈ నెల 22 నుంచి ఈ దూకుడు మరింత పెరిగింది. విజయవాడ మార్కెట్‌లో ఈ నెల 22న 10 గ్రాముల 24 క్యారెట్స్ గోల్డ్ ధర రూ.1,02,500 ఉండగా 23న బుధవారం నాటికి రూ.1,200 పెరిగి రూ.1,03,700కు చేరింది. 22 క్యారెట్ గోల్డ్ ఒక్కరోజులో రూ.950 పెరిగి రూ.93,800కు చేరింది. కేజీ వెండి సైతం 24 గంటల వ్యవధిలో రూ.2వేలు పెరిగి రూ.1,19,500కు చేరుకుంది.



మరింత పెరిగే అవకాశం ఉందా..!

గత 40 రోజుల్లో ఎలాంటి శుభ ముహూర్తాలు లేవు. ఈ నేపథ్యంలో బంగారం, వెండి కొనుగోలుపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. ధరల విషయాలు చర్చకు రాలేదు. అయితే ఈ నెల 26 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఆగష్టు 27 వరకు అన్ని ప్రాంతాలు శుభకార్యాలతో కళకలలాడుతాయి. ఆషాడంలో ఎడబాటుకు గురైన కొత్త జంటలు మరో మూడు రోజుల్లో కలుసుకుంటారు. ఈ సందర్భాల్లోనూ బంగారం, వెండి వాటి పాత్రలను పోషిస్తుంటాయి. శ్రావణ శుక్రవారాలు మహిళల అలంకరణలోనూ బంగారం, వెండి ప్రముఖం. ఇప్పటికే తాకట్టులోని ఆభరణాలు విడిపించేందుకు ప్రజలు సన్నాహాలు ప్రారంభించారు. ఈ తరుణంలో పూజలకు కొత్తగా ఆభరణాలు చేయించుకోవడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. శ్రావణ మాసంలో కనీసం రెండు గ్రాముల బంగారమైనా కొనాలనే ఆతృత ప్రజల్లో అనాదిగా వస్తుంది. ఈ నేపథ్యంలోనే నగరంలోని 74 గోల్డ్ షాపులు, మచిలీపట్నంలోని 17 గోల్డ్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడతుంటాయి. ప్రస్తుత ధరతోనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరో మూడు రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని, అంతర్జాతీయంగా మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

కూలిన ఇనుప గడ్డర్లు

ఎంజీ రోడ్డులో తప్పిన పెను ప్రమాదం

విజయవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ.. ఎంజీ రోడ్డు... పాదచారులు, వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారి. పక్కనే షాపింగ్ నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్న ఇనుప గడ్డర్లు, స్తంభాలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. ఆ సమయానికి అటుగా రాకపోకలు లేకపోవడం, కార్మికులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. ఎంజీ రోడ్డులో తనైరా షాపింగ్ మాల్‌కు ఎదురుగా టిప్పీటాప్పీ షాపింగ్ మాల్‌కు చెందిన ఖాళీ స్థలం ఉంది. సుమారు 1920 చదరపు గజాల స్థలంలో కొత్తగా షాపింగ్ మాల్ నిర్మిస్తున్నారు. దీన్ని భవనంలా కాకుండా ఇనుప స్తంభాలు, గడ్డర్లతో ఫ్యాబ్రికేటెడ్‌గా నిర్మిస్తున్నారు. స్థల యజమాని మణిప్రీతిసింగ్ ఈ నిర్మాణ పనులను చేయడానికి మట్టపల్లి రత్న అనే ఇంజనీర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. అగ్రిమెంట్ గడువు దగ్గర పడుతుండడంతో కాంట్రాక్టర్ హడావుడిగా నిర్మాణపు పనులు చేస్తున్నారు. వారం రోజులుగా 30 నుంచి 40 అడుగుల ఎత్తున్న ఇనుప స్తంభాలను నిలబెట్టి, అనుబంధంగా పైభాగాన భారీ గడ్డర్లను అమర్చారు. ఈ స్తంభాలకు భీమ్‌ల మాదిరిగా అడ్డంగా ఎలాంటివీ ఏర్పాట్లు చేయలేదు. వారం రోజుల్లో ఒక భారీ షెడ్ మాదిరిగా సెట్ చేశారు. పైనున్న గడ్డర్ల బరువు ఇనుప స్తంభాలపై పడడంతో వెనుక వైపునున్న స్తంభాలు నేలకొరిగిపోయాయి. దీనితో ఒక్కసారిగా ఇనుప స్తంభాలు, గడ్డర్లు క్షణాల్లో నేలమట్టమయ్యాయి. వాటిలో ఒక స్తంభం రోడ్డుపై పడింది. ఆ సమయానికి వర్షం పడుతుండడంతో జన సంచారం లేదు. లేకపోతే ప్రాణ నష్టం సంభవించేది. ఎంజీ రోడ్డు వైపు పడి ఉంటే ప్రమాద తీవ్రత దారుణంగా ఉండేది. కార్మికులంతా విధులు నుంచి వెళ్లిపోయిన తర్వాత ఈ ఘటన జరిగింది. ఈ స్థలంలో బేస్‌మెంట్ కోసం భూమిని తవ్వి అందులో కాంక్రీట్, మట్టిని నింపారు. బాగా లోతుగా తవ్వడంతో పక్కనున్న భవనం పునాది ఒరిగిపోయింది. దీనికి నష్టపరిహారంగా రూ.40లక్షలను చెల్లించినట్టు స్థానికులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ హడావుడిగా పనులు చేయడం వల్లే ఈ ఇనుప గడ్డర్ల అమరిక నేలమట్టమైందని ఆరోపిస్తున్నారు.



గడ్డర్లను తొలగిస్తున్న సిబ్బంది

దుష్ప్రచారాలతో పైశాచికానందం

- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో తాను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసినట్టు దుష్ప్రచారాలు చేస్తూ కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రచారాన్ని ఆయన ఖండించారు. బుధవారం రాత్రి తన స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న తాను కుటుంబంతో కలిసి విమానంలో తిరుమలకు వెళ్తుంగతా అదే విమానంలో పెద్దిరెడ్డి కూడా కుటుంబ సభ్యులతో ప్రయాణం చేశారన్నారు. ఆయన్ను సార్ బాగున్నారా అని పలకరిలించాను. ఆయన బాగున్నానన్నారు. ఈ పలకరింపు మొత్తం 8 సెకన్లలోపు జరిగిందన్నారు. నేను తిరుపతిలో ఉండగా సీఎం నుంచి పిలుపు వచ్చిందని, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10.40 వరకు సీఎం కార్యాలయంలో ఉన్నానని, 40 నిమిషాలు సీఎం చంద్రబాబుతో సమావేశమైనట్టు కొలికపూడి తెలిపారు. ఆదే రోజు రాత్రి తిరువూరు వచ్చానని, 2 రోజులుగా పట్టణంలోనే ఉన్నానన్నారు. కానీ పెద్దిరెడ్డిని రాజమండ్రిలో కలిసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు తన పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారని, 66.4 శాతం మార్కులిచ్చారని, అవినితిపై 5.5శాతం ఆరోపణలున్నట్టు తెలిసిందన్నారు. నా గురించి నియోజకవర్గ ప్రజలకు తెలుసని, ఇలాంటి గాలి వార్తలు పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గుర్రం జాషువా పురస్కారాల ప్రదానోత్సవం

భారతీనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా హరిశ్చంద్రనాటకంలోని కాటికాపరి పద్యాలతో గ్రామీణుల హృదయాల్లో కొలువై ఉన్నాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆంధ్ర లయోలా కళాశాల తెలుగువిభాగం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లయోలా కళాశాల సెమినార్‌హాల్‌లో కవికోకిల గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా గుర్రం జాషువా జీవిత చరిత్రపై కవి సమ్మేళనం, గుర్రం జాషువా సాహిత్య పురస్కార ప్రదానోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిధులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్, వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పాల్గొని కవికోకిల గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ నాకు ఇష్టమైన కవుల్లో గుర్రం జాషువా కవి ఒకరన్నారు. అనంతరం ప్రిన్సిపల్ ఫాదర్ ఎస్ మెల్కియోర్ కవి సమ్మేళనంలో పాల్గొన్న 8 మంది కవులను ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు ఎస్వీ ఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందే శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ జీ కిరణ్, కరస్పాండెంట్ ఫాదర్ ఏ రెక్స్ ఏంజిలో, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్, ప్రాచ్యభాషల శాఖాధ్యక్షుడు డాక్టర్ కోలా శేఖర్, డాక్టర్ ఆర్ రవీంద్రభాస్, సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ మువ్వ శ్రీనివాస్‌రెడ్డి, స్నేహల్ విమల్ శుక్ల, డాక్టర్ ఏ దయాకర్, డాక్టర్ ఆర్ జాన్, డాక్టర్ బీ సుబ్బారావు, గుర్రం జాషువా సాహిత్య అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోండి

కృష్ణలంక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పరంగా మెరుగైన మార్పులు చేయడంతో ప్రవేశాలు పెరిగాయని, వీటిని సద్వినియోగం చేసుకొని కెరీర్‌పరంగా నిర్దేశించుకొన్న లక్ష్యాల సాధనకు బంగారు బాటలు వేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను కలెక్టర్ లక్ష్మీశ గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా? లేదా? ఆహారం నాణ్యత ఎలా ఉంది? వంటి వాటిని పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో 370 మంది విద్యార్థులుండగా అందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నట్టు తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటిస్తూ కెరీర్ పరంగా నిర్దేశించుకొన్న లక్ష్యాలేమిటో అడిగి తెలుసుకొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం నరసింహాచార్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయండి

సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనను అందించడంతో పాటు సృజనాత్మక శక్తిని వెలికితీసేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం సమగ్ర శిక్ష అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంగలగూడెంలో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జీ మహేశ్వరరావు, సీఎంవో ఎన్ చంద్రశేఖర్, ఏఎంవో ఎస్ అశోక్‌బాబు, అసిస్టెంట్ ఏఎంవో శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ ఏవీవీ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ప్రగతి సూచికల లక్ష్యాల సాధనకు కృషి

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల వారీగా దార్శనిక ప్రణాళికల రూపకల్పన జరిగిందని, శాఖల వారీగా కీలక పురోగతి సూచికలు (కేపీఐ)పై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రధానంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టి, రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. వ్యవసాయం, మత్స్య, పట్టు పరిశ్రమ, సాంఘిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో స్వర్ణాంధ్ర విజన్ - కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహించారు. సీపీవో వై శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎం రమేష్, డీఆర్ఎం పాటిల్

డివిజన్‌లో 15 గూడ్స్ షెడ్‌ల అభివృద్ధి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో 15 గూడ్స్ షెడ్డుల అభివృద్ధికి కొనసాగుతున్న పనులు డిసెంబరు నాటికి పూర్తవుతాయని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆధునీకరణతో పాటు కార్గో సామర్థ్యం పెంపుదల, చార్జీల ఆదాయం మెరుగవుతాయన్నారు. గురువారం విజయవాడలోని డివిజన్ కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) ఎన్ రమేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో అభివృద్ధి పనులపై డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సమగ్ర సమాచారాన్ని అందించారు. గుర్తించిన 15 గూడ్స్ షెడ్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, డిసెంబరుకు పూర్తవుతాయన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధిని ఆయన వివరించారు. దీనిపై స్పందించిన పీసీసీఎం ఎన్ రమేష్ మాట్లాడుతూ గూడ్స్ షెడ్లకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం, సీసీటీవీల అమరిక, ప్లాట్‌ఫారం పనులు పూర్తి, కార్మికులకు సౌకర్యాలు వంటివాటిపై సూచనలు చేశారు. అమృత్ భారత్ స్టేషన్ల పనులను వేగవంతం చేయాలని బ్రాంచి ఆఫీసర్లకు సూచించారు. స్థానిక మార్కెట్ల డిమాండ్లకు అనుగుణంగా రేక్‌లను ఏర్పాటు చేసి సరుకు రవాణా ఆదాయాన్ని పెంచాలన్నారు. టికెట్ చెక్కింగ్ పనితీరును కూడా ఆయన సమీక్షించారు. ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్లు స్క్వాడ్, వారి సౌకర్యాల గురించి, విధులలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆరా తీశారు. సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు వందన సమర్పణ చేయగా, చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్) బీ సత్యనారాయణ, ఏడీఆర్ఎంలు పీ ఈ ఎడ్విన్, శ్రీనివాసరావు కొండా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సత్కరించి పూలమొక్కను బహూకరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపాలి

- శాప్ చైర్మన్ రవి నాయుడు

లబ్బీపేట స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పారా అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని శాప్ చైర్మన్ రవి నాయుడు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఆగస్టు 9 నుంచి జరగబోయే రాష్ట్ర స్థాయి 6వ జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథెటిక్స్ క్రీడా పోటీల పోస్టర్‌ను శాప్ కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టులో హర్యానాలో జరిగే జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికై రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి వీ రామస్వామి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు టీ రాము పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డే ను ఘనంగా నిర్వహించాలి

అగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను ఘనంగా నిర్వహించాలని మంత్రి ఎం రామ్ ప్రసాద్ రెడ్డి శాప్ చైర్మన్ రవి నాయుడును ఆదేశించారు. సచివాలయంలో గురువారం మంత్రిని శాప్ చైర్మన్ రవి నాయుడు కలిశారు. కూటమి ఏడాది పాలనలో చేపట్టిన క్రీడాభివృద్ధిని, విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న దేవరాజు మహారాజు

హిందూ జాతీయవాదానికి అనుగుణంగా పాఠ్యాంశాల మార్పు

- సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పు సదస్సులో వక్తలు

గవర్నర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హిందూ జాతీయవాదానికి అనుగుణంగా స్కూల్ పాఠ్యాంశాలను చేర్చేందుకు అధికార బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రముఖ జీవశాస్త్రవేత్త, త్రిపురనేని జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో సైన్స్-చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పులనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సుకు విద్యావేత్త ఎస్ఆర్ పరిమి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలు దాచిపెట్టి తమ హిందుత్వ ఎజెండాను వాడుకలోకి తేవాలన్నదే ఆర్ఎస్ఎస్, బీజేపీ ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాల పాఠ్యపుస్తకాల నుంచి సైన్సు, చరిత్రకు సంబంధించి పలు అంశాలను తొలగించిందని, జీవ పరిణామాన్ని విజ్ఞాన శాస్త్ర సిలబస్‌లో లేకుండా చేయడం బాధాకరమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన పరిమి మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో మార్పులు అశాస్త్రీయతతో కూడుకుని ఉండటం విచారించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వాలు సెక్యులర్ భావాలకు కట్టుబడి ఉండాలని, లౌకిక విధానాలను గౌరవించిన వారే పాఠ్యపుస్తకాలను రాయడానికి అర్హులన్నారు. సదస్సులో మేడసాని సుధాకర్, ఎంబీవీకే కన్వీనర్ పీ మురళీకృష్ణ ప్రసంగించారు.

లిక్కర్ స్కాంపై స్వతంత్ర దర్యాప్తు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ అధ్యక్షుడు భార్గవ్

విజయవాడ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన అతిపెద్ద కుంభకోణం లిక్కర్ స్కాం, మాజీ సీఎం జగన్ రెడ్డి అరెస్ట్‌కు సంబంధించి సమగ్రమైన స్వతంత్ర్య దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ విభాగం అధ్యక్షుడు వల్లూరి భార్గవ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ స్కాంలో అవినీతితో పాటు రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, సంపద, జీవితాలపై ప్రత్యక్ష దాడి జరిగిందన్నారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



నేడు షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలు

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ గుడివాడ ఆల్ స్కూల్స్ చెస్ పోటీలు, జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పోటీలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభిస్తారన్నారు. చెస్ విభాగంలో అండర్-9, అండర్-11, అండర్-13, అండర్-15 విభాగాల్లో విడివిడిగా పోటీలు, అండర్-13, అండర్-15 విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు యలవర్తి తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సంపద తయారీ కేంద్రాలు పరిశీలన, సేవలపై ఆరా

కూచిపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా సర్వే బృంద ప్రతినిధులు మొవ్వ పంచాయతీ పరిధిలోని పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సంపద తయారీ కేంద్రాలు పరిశీలించి వివరాలు సేకరించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నాయా? లేదా, వాటి నిర్వహణ ఎలా ఉంది, మంచినీటి సౌకర్యం తదితర అంశాలు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలు గృహాలను సందర్శించి తడి, పొడి చెత్తకు సంబంధించిన డస్ట్ బిన్లు ఉపయోగిస్తున్నారా? పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు జి.రవి వర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధి కె.పవన్, జిల్లా పంచాయతీ ప్రతినిధి వెంకటరత్నం, ఈవోపీఆర్డీ పరమాత్మ, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మొవ్వ, పామర్రుల్లో సర్వే నిర్వహిస్తున్న బృందం సభ్యులు

పమిడిముక్కల: తాడంకి, గురజాడ, వేల్పూరు గ్రామాల్లో బృందం పర్యటించి ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు, సచివాలయాల్లో సేవలపై ఆరాతీసి రికార్డులు పరిశీలించారు. గృహయజమానులతో మాట్లాడి వివరాలు నమోదుచేశారు. పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మురుగుకాల్వల సమస్యపై క్షేత్రస్థాయిలో పరిలించి సర్వే ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఎంపీడీవో వి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి భవాని, సర్వే కో-ఆర్డినేటర్లు బాపూజీ ఏసుబాబు, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి పాల్గొన్నారు.

పామర్రు: కేంద్రబృందం గురువారం పామర్రు పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయం ప్రాంతంలోని ప్రభుత్వ సంస్థలతోపాటు, పలుగృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాంద్రుజ్యోతి, ఎడ్యుకేషన్, వేల్ఫేర్ సహాయకురాలు బి.పల్లవి, డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార స్పీడ్ బ్రేకర్లు

● అవస్థలు పడుతున్న వాహనచోదకులు
●అధికారులు పట్టించుకోవటంలేదని ఆగ్రహం

నందివాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై వేగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రధాన, ప్రమాదాలు జరిగే చోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తారు. కానీ పోలుకొండ, లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో కదిలివచ్చే స్పీడ్ బ్రేకర్లతో వాహనచోదకులే కాదు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పశుపోశకులు ఆవులను ఇష్టానుసారంగా వదిలివేస్తుండటంతో రోడ్లపై వచ్చి నిలబడి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యను పంచాయతీల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడంలేదని అంటున్నారు. పాలిచ్చే సమయానికి ఆవుల యజమానులు ఆవులను ఇళ్లకు తొలుకుని వెళ్లి పాలు తీసుకుని రోడ్లపైకి తోలివేయటం అలవాటుగా మారిందంటున్నారు. ప్రధాన రహదారులపై పడుకోవటంతో రాత్రిళ్లు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది బైక్‌పై వెళ్లే సమయంలో ఆవులు కనపడక ఢీకొని ఆసుపత్రుల పాలైన సంఘటనలున్నాయి. చేపల చెరువుల యజమానులు టాంటాం ద్వారా ఆవులను జాగ్రత్త చేసుకోండి అని తెలిపినా వాటిని యజమానులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాలకు, అధికారులు చొరవ చూపి ఆవులను రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పోలుకొండ, లక్ష్మీనరసింహపురం గ్రామస్థులు కోరుతున్నారు.



నడిరోడ్డుపై నిలిచిన గోవులు

గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు 27న

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : పాటిమీద వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 27న శ్రీగోదాదేవి తిరునక్షత్ర వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు. ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అమ్మవారికి శ్రావణ పట్టి(సారె)ను సమర్పిస్తామన్నారు. 27న రైల్వేస్టేషన్ రోడ్డులోని చలసాని ఇందిరా రమణరావు స్వగృహం నుంచి మేళతాళాలు, కోలాట నృత్యాలు మధ్య శ్రీవల్లీ పుత్తూరు నుంచి వచ్చిన తిరుమంజన పూజా సామగ్రి, శ్రావణ పట్టి(సారె) ఊరేగింపు జరుగుతుందన్నారు. సమావేశంలో కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరారమణరావు, వేదపండితులు వేదాంతం అప్పలాచారి. కోలాట భజన సమాజం ఆర్గనైజర్లు జె.వి.వి.కుమారి, సంకుల దుర్గామాత, చిన్ని, పంతంగి హేమ, బి.హరి బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్లోరినేషన్‌పై ఆరా

గుడ్లవల్లేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరా పరిశుభ్రంగా ప్రజలకు అందేలా రక్షిత నీటి పథకంపై సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఇమ్రాన్ అన్నారు. వడ్లమన్నాడు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. రక్షితనీటిని సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంక్ ఫిల్టర్‌ను పరీక్షించారు. వర్షాకాలం తాగునీటి విషయంలో మరింత జాగ్రత్తలు వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రంగా ఉంచాలి

గుడివాడ రూరల్: శ్రీకాళహస్తీ పరిసరాలను, రహదారులను పరిశుభ్రంగా ఉంచటానికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. రహదారుల్లో వర్షపు నీరు నిల్వ ఉందని ఫిర్యాదు రావటంతో ఆయన పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటమే కాకుండా బ్లీచింగ్ తదితర పనులు చేపడతామని తెలిపారు. కాలనీవాసులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. చెత్త వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంద న్నారు. కార్యదర్శి ఆర్.కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



పీ-4పై అవగాహన

పెదపారుపూడి: బంగారు కుటుంబాలకు భరోసా కల్పించి వారిని మెరుగైన స్థితికి మార్గదర్శకులుగా తీసుకుని రావటమే పీ4 లక్ష్యం డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ అన్నారు. గురువారం మోపర్రు సభలో మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సమాజాభివృద్ధిలో ఇది చాలా కీలకమన్నారు. గ్రామంలో సర్వే జాబితాను అనుసరించి బంగారు కుటుంబాల వివరాలు ఖరారు చేయటం జరుగుతుందన్నారు. సర్పంచ్ జూపల్లి కమలకుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కార్యదర్శి చొదిమెళ్ల పుల్లారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మల్లాయిపాలెం శివారు జగనన్న కాలనీ వాసులు

స్మార్ట్‌మీటర్లు పెట్టనీయం

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీలోని 6500ఇళ్లల్లో ఏ ఒక్క ఇంటికి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనీయమని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు బి.వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మల్లాయిపాలెం శివారు జగనన్న కాలనీ మెయిన్ సెంటర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లలో ఎవరూ లేని సమయంలో మీటర్‌లను బిగించటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక నిధులు విడుదల చేసి కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లు, మంచినీటి పైపులు, వీధి దీపాలను వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోనాగేశ్వరరావు, సాంబశివరావు, నాగమణి, నాగలక్ష్మీ, అలివేలు మంగ, వెంకటేశ్వరరావు, రంగారావు, చిన్న, వెంకట దుర్గారావు, ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

జాషువా చిరస్మరణీయుడు

సాహితీ స్రవంతి

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : సుందరయ్యభవన్‌లో సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర అధ్యక్షతన గుర్రం జాషువ వర్ధంతిసభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ సాంఘిక దురాచారాలపై కలాన్ని ఎక్కుపెట్టిన జాషువ స్ఫూర్తితో వర్తమాన కవులు రచనలు చేయాలని సూచించారు. సాహితీ అభిమానులు అవిర్నేని వెంకటేశ్వరరావు, వసుధ బసవేశ్వరరావు, వి.కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హైలెస్సో.. హైలెస్సా..

●కృష్ణాకు వరద ● పడవలపై పొలాలకు రైతులు

తోట్లవల్లూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీపాయలకు గురువారం జలకళ వచ్చింది. ఎగువ ప్రకాశం బ్యారేజ్ నుంచి విడుదుల చేసిన వరద నీరు గురువారం ఉదయం మండలంలోని పాయలకు చేరింది. వరద నీటి ప్రవాహానికి లంక పొలాలకు వెళ్లే తాత్కాలిక రహదారులు కోతకు గురయ్యాయి. వరద పెరగటంతో పడవలపై రైతులు లంక పొలాలకు వెళ్లివచ్చారు. ఎనిమిది లంక గ్రామాల ప్రజలు పడవ ప్రయాణం సాగించాల్సి వచ్చింది. వరదతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.



పడవపై లంకల్లో పొలాలకు వెళ్లి వస్తున్న రైతులు



ఏఎన్‌ఆర్ కళాశాల ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

ఏఎన్‌ఆర్ కళాశాల కార్యదర్శి అప్పారావు

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : సర్ ఆర్థర్ కాటన్ దొర అపరభగీరథుడని ఏఎన్‌ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్.అప్పారావు అన్నారు. గురువారం కళాశాల ఆవరణలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది ఎకరాలకు రైతులకు సాగునీరు అందుతుందంటే కాటన్ దొర పుణ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్, ఐటీ శాఖ అధికారులు ఆర్.మూర్తి, వి.సందీప్, సీఏ ఎం.ఆర్.ప్రసాద్, కళాశాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యంకికి ఘన నివాళి

గుడివాడ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి గ్రంథాలయ అధికారి జి.రత్న చంద్ర ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ఆదాయపు పన్ను శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారంఏఎన్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. తొలుత కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఉయ్యూరు సందీప్, ఆర్ఎస్ఆర్ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు సురేష్ బాబు, రవికుమార్ ఆదాయపు పన్ను ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. క్విజ్ పోటీల్లో గెలపొందిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

సీపీఐ బలోపేతానికి గూడపాటి కృషి అభినందనీయం

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : సీపీఐ బలోపేతానికి కృషిచేసి తరువాత తరాన్ని కూడా పార్టీ కోసం కష్టపడే వారిగా గూడపాటి సువిశ్వేశ్వరరావు తీర్చిదిద్దారని జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. పెదఎరుకపాడులోని గూడపాటి స్వగృహంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు వసంతాల ఉత్సవాల్లో భాగంగా గూడపాటిని ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తాతయ్య, ఎస్టీయూ రాష్ట్రనాయకులు ఎం.వి.ఎస్.ఎన్. ప్రసాద్, గూడపాటి ప్రకాష్‌బాబు, చింతలూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వితరణ

తోట్లవల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : యాకమూరులో కె.రవి అనే బార్బర్‌కు ఉయ్యూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం రూ.30 వేలతో బార్బర్ షాపుని తయారు చేయించి గురువారం బహుకరించారు. బార్బర్ షాపులేక అవస్థలు పడుతున్న రవికి తనసొంత ఖర్చులతో బడ్డీ షాపును తయారు చేయించానని సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా, చొప్పరపు వెంకటేశ్వరరావు, తల్లం హనుమంతరావు, గడ్డం సాయి కల్యాణ్ పాల్గొన్నారు.



రైతులకు ఉచితంగా కంది విత్తనాలు

కూచిపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి మాగాణి పొలాల్లో గట్లపై సాగు చేసుకోవటానికి రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేపట్టారు. మండల పరిధిలోని 21 పంచాయతీల్లో ఎంపిక చేసిన రైతులకు అందిస్తున్నారు. గురువారం కూచిపూడిపంచాయతీలోని రైతులకు వీఏఏ శ్రావణి కందివిత్తనాలు అందజేశారు.

పాఠశాలలకు ఐడీబీఐ వితరణ

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ఎస్‌పీఎస్, ఎస్‌జీఆర్‌కే, ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, 20వవార్డు బేతవోలు, స్లేటర్‌పేట మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధుల నుండి కంప్యూటర్‌లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీజీఎం జానకీరామ్, జనరల్ మేనేజర్ సాయికృష్ణ, బ్రాంచ్ మేనేజర్ ఆదిశేషుకుమార్, ఎంఈవో జగన్మోహనరావు పాల్గొన్నారు.

పామర్రు: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐడీబీఐ జోనల్ మేనేజర్ ఎం.జానకీరామ్ అన్నారు. పామర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు వందల మధ్యాహ్న భోజనం ప్లేట్స్, 25 కుర్చీలు, 20 టేబుల్స్, పది ఫ్యాన్లు ఇతర సామగ్రి గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి సామాజిక బాధ్యతగా తీసుకుని తమ బ్రాంచ్ కృషిచేస్తుందన్నారు. రీజినల్ మేనేజర్ సాయికృష్ణ, ఉయ్యూరు మేనేజర్ కె.అనుదీప్‌సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం నేడు

గుడివాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : రావి వీరభద్రయ్య బహుళార్థ పశువైద్యశాలలో శుక్రవారం నల్ల, తెల్ల జాతి పశువుల్లో ఎదకు రాని పశువులకు, తిరగపొర్లే పశువులకు పరీక్షలు నిర్వహించేందుకు వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరుచూరి రత్నశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కౌతవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గుడ్లవల్లేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం గ్రామంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ జి.బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌతవరం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించేందుకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

సమీక్షా సమావేశంలో ఎంపీడీవో జ్యోతి

పామర్రు, జూలై24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన అంశాలను అవగాహన చేసుకుని గ్రామ సచివాలయ ఉద్యోగులు సామర్థ్యాలు, నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ఐగాట్ కర్మయోగి ఎంతోగానో దోహదపడుతుందని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులుతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశించిన సమగ్ర సర్వేలను వేగవంతంగా పూర్తిచేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేలా సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.కిషోర్, పంచాయతీ కార్యదర్శులు సలీం, పద్మశ్రీవేణి, పూర్ణచంద్రరావు, అంజినాదేవి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించండి

• అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం

ఘంటసాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): గుండేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. గురువారం దేవరకోట వద్ద గుండేరు మేజర్ డ్రెయిన్‌ను ఆయన పరిశీలించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ డీఈఈ బాబూ నాయక్ పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న ఘంటసాల గ్రామ ప్రముఖుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేమూరి విశ్వేశ్వరరావును ఎమ్మెల్యే పరామర్శించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



మోపిదేవి వార్పు వద్ద కాటన్ దొర విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నేతలు

చిరస్మరణీయుడు కాటన్ దొర

మోపిదేవి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగానికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం మోపిదేవి వార్పు వద్ద కాటన్ దొర వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. బ్రిటీష్ సైనికాధికారిగా దేశానికి వచ్చిన కాటన్ నీటి పారుదల ఇంజనీరుగా లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చే ప్రాజెక్టులు నిర్మించి రైతులకు మేలు చేశారన్నారు. మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈఈ గణపతి, పంచాయతీరాజ్ శాఖ డీఈ పగడాల సురేష్, మండలి రామ్మోహనరావు, ఏఈఈలు రామ్ కుమార్, పొన్నూరు రవి తేజ, దోవారి విజయ్‌కుమార్, తానేటి ప్రసాద్ పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో గుర్రం జాషువా, కాటన్‌దొర చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ తదితరులు

గుర్రం జాషువా, కాటన్ దొరకు ఘన నివాళి

అవనిగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో కవి గుర్రం జాషువా, సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతిని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఆ పార్టీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావుల నేతృత్వంలో నిర్వహించారు. జాషువా, కాటన్ దొర చిత్రపటాలకు వారు నివాళులర్పించారు. మండవ బాలవర్ధిరావు, కర్రా సుధాకర్, మెండు లక్ష్మణరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, దాసినేని శ్రీనివాసరావు, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు, షేక్ బాబావలి పాల్గొన్నారు. గాంధీక్షేత్రంలో మండలి వెంకట్రామ్ నేతృత్వంలో గుర్రం జాషువా, కాటన్ దొరల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తి శ్రీనివాసరావు, బచ్చు రఘునాథప్రసాద్ పాల్గొన్నారు.

జాషువా కవిత్వం అజరామరం

మచిలీపట్నం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువా దివంగతులయినప్పటికీ ఆయన కవిత్వం అజరామరంగా నిలిచిపోయిందని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు అన్నారు. జాషువా వర్ధంతి సందర్భంగా జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం జాషువా చిత్రపటానికి పెద్దిరాజుతో పాటు కొడాలి శర్మ, పి.రామ్‌దేవ్, సాంబశివరావు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు



కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహిత్య, సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

కోట శ్రీనివాసరావు మృతి
కళారంగానికి తీరని లోటు

మచిలీపట్నం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటని సాహితీమిత్రులు సంస్థ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అన్నారు. భావతరంగిణి ఆధ్వర్యంలో చిత్రకళాసంసద్ భవన్‌లో గురువారం నిర్వహించిన కోట శ్రీనివాసరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కోట శ్రీనివాసరావు కాంస్య విగ్రహాన్ని కంకిపాడులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక కార్యకర్త పీవీ ఫణికుమార్, భావతరంగిణి అధ్యక్షుడు భవిష్య, బీజేపీ నాయకులు పంతం గజేంద్రరావు, ధూళిపాల శ్రీరామచంద్రమూర్తి, ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్, వెనిగండ్ల ఉమామహేశ్వరరావు, జె.శేఖర్, సూరిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.

పులిగడ్డలో మధ్యాహ్న భోజనం పరిశీలన

అవనిగడ్డ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో ఎన్.శివశంకరరావు గురువారం పరిశీలించారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో 33 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శివశంకరరావు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

మచిలీపట్నం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వెంకటరమణయ్య చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేముపల్లి రవికుమార్ నివాళులర్పించారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఉత్సవాలు జరిగాయి. గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, పలువురు పాఠకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆకులమన్నాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్





చిన్నాపురంలో కరపత్రాలు పంచుతున్న నియోజకవర్గ పరిశీలకుడు లుక్కా సాయిరామ్‌గౌడ్, టీడీపీ మండలాధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, పులిగడ్డలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

హామీలన్నీ అమలు చేస్తాం

• ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం ఆకులమన్నాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, సర్పంచ్ మొహమ్మద్ రఫీ, ఎజ్జు శివాజీ, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, కట్టా మునేశ్వరరావు, సిరివెళ్ల శ్రీను, కూనపరెడ్డి పెద్దిరాజులు, జన్ను ప్రసాద్, తమ్మన శ్రీను, సమ్మెట రాఘవప్రసాద్, తోట వేణు, బొర్రా శ్రీను, పోతుల రాము, ఎంపీటీసీ కోళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురంలో..

మచిలీపట్నం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు లుక్కా సాయిరామ్‌గౌడ్ అన్నారు. చిన్నాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ తాడికొండ పరంజ్యోతి, పినిశెట్టి నిరంజనరావు, నాయకులు కుంచనపల్లి సురేష్, నూకల నాగపున్నారావు, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెంలో..

మోపిదేవి: కొక్కిలిగడ్డ కొత్తపాలెంలో టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, తెలుగుయువత నాయకుడు రావి రత్నగిరి, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, పడమటి వెంకటేశ్వరరావు, బల్లా సీతారామ ప్రసాద్ పాల్గొన్నారు.

పాగోలులో..

చల్లపల్లి: సుపరిపాలనలో తొలిఏడాది కార్యక్రమాన్ని పాగోలులో టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, తెలుగుమహిళా జిల్లా కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, మల్లంపల్లి శివరామకృష్ణ, మోర్ల శివ, షేక్ నబీషోరి పాల్గొన్నారు.

పులిగడ్డలో..

అవనిగడ్డ రూరల్: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పులిగడ్డలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలి రామ్మోహనరావు, పరుచూరి దుర్గాప్రసాద్, మండవ బాలవర్ధిరావు, కర్రా సుధాకర్, మెగావత్తు గోపి, దాసినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు 9వ వార్డులో..

కోడూరు: కోడూరు 9వ వార్డులో టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. నాయకులు వేములపల్లి రాజేష్, పిల్లి మల్లికార్జునరావు, బొడ్డు వెంకన్న, పాశం పాండురంగారావు, తాతా పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పిలుపుతో పీ-4లో భాగస్వామినయ్యా

• విద్యార్థులతో మురారి సాత్విక్



మురారి సాత్విక్‌ను సన్మానిస్తున్న విజయా అకాడమీ విద్యార్థినులు

చల్లపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతోనే పీ-4 కార్యక్రమంలో భాగస్వామిని అయ్యానని, నలుగురు పేద విద్యార్థులకు విదేశీవిద్యను అందించటానికి రూ.50 లక్షల సహాయం ముఖ్యమంత్రికి అందించానని పీ-4 భాగస్వామి మురారి సాత్విక్ తెలిపారు. గురువారం చల్లపల్లిలో తాను చదువుకున్న విజయా అకాడమీకి వచ్చి పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. సాత్విక్‌ను కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ సత్కరించారు. ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరి, డి.జవహర్ తదితరులు పాల్గొన్నారు. సాత్విక్‌కు ఎన్నారై, విజయా అకాడమీ, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బంటుమిల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె.సువర్చల ఆధ్వర్యంలో గురువారం 75 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నోస్టిక్ బస్సులో విలువైన పరీక్షలు ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, మెమోగ్రామ్, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఐదుగురిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

చల్లపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రామలింగ చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా పడమరవీధిలోని అమ్మవారికి దేవాంగ మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఉమ్మిటి దేవీకుమార్ ఇంటివద్ద నుంచి మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా సంపటాలమ్మ ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా చౌడేశ్వరీ అమ్మవారి ఆలయానికి చేరుకుని ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు బళ్లా విశ్వనాథం, బట్ట వెంకటేశ్వరరావు నేతృత్వంలో దేవికుమార్ దంపతులు పూజలు చేశారు.





చల్లపల్లిలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి సారె తీసుకెళుతున్న భక్తులు, పెడనలో శ్యామలాంబకు సారె సమర్పించేందుకు వెళుతున్న గుడివీధి మహిళలు

కోడూరులో గంగానమ్మకు..

కోడూరు: గంగానమ్మ అమ్మవారికి వడ్డెర పాలెం భక్తులు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

పెడనలో శ్యామలాంబకు..

పెడన: దేవాంగుల ఇలవేల్పు శ్యామలాంబ పుట్టినరోజు సందర్భంగా శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు దీక్షానందుడు పాల్గొన్నారు. గుడివీధికి చెందిన మహిళలు శ్యామలాంబకు ఆషాఢ సారె సమర్పించారు. ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, బండారు ఆనందప్రసాద్ పాల్గొన్నారు.

డొంక రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

• ఏఎంసీ చైర్మన్ కుంచె నాని

మచిలీపట్నం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డొంకరోడ్లు అభివృద్ధి చేస్తామని, రైతులకు మెరుగైన సేవలందిస్తామని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచె నాని అన్నారు. గురువారం మార్కెట్‌యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొల్లు రవీంద్ర తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. డైరెక్టర్లతో, అధికారులతో విస్తృతసమావేశం ఏర్పాటు చేసి నిధులు, బాకీల వసూలుపై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. నానీని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, కోస్తామురళీకృష్ణ సత్కరించారు.



కుంచె నానీని సత్కరిస్తున్న తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, కోస్తా మురళీకృష్ణ




కళాకారులకు వాయిద్య పరికరాలు అందిస్తున్న జనసేన చల్లపల్లి నాయకులు, మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ

డప్పు కళాకారులకు జనసేన చేయూత

చల్లపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తీన్‌మార్ వాయిద్యాన్ని నేర్చుకున్న మంగళాపురం యువకుల బృందానికి రూ.25వేలు విలువైన తీన్‌మార్ డప్పులను జనసైనికులు వితరణగా అందించారు. రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, కూటమి నేతలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీర సమర్పించి పూజలు చేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, అడపా రవి, టీడీపీ నేతలు రావి చిట్టి, రావి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలి

కోడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దింటిమెరక రహదారి సమీపంలో వడ్డెర కాలనీ పక్కన ఉన్న శ్మశానవాటిక ఆక్రమణలకు గురైందని, అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా ఉందని, ఆక్రమణలు తొలగించాలని 4, 5, 6, 7 వార్డు ప్రజలు కోరుతున్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్‌కు వారు వినతిపత్రం అందించారు. శ్మశాన వాటికకు వెళ్లే మార్గం ముళ్లపొదలతో మూసుకుపోయి ఉందని తెలిపారు. శ్మశాన వాటికను సర్వే చేయించి చుట్టూ ఆక్రమణలు తొలగించి ప్రహరీ, రహదారి నిర్మించాలని కోరారు. బత్తుల శ్రీహరి, ఉప్పు చిన్న వెంకటేశ్వరరావు, బండారు రవీంద్ర పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

నేటి నుంచి శ్రావణలక్ష్మీ వైభవం

మచిలీపట్నం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఈడేపల్లి సత్యసాయి మందిరంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు సత్యసాయి శ్రావణలక్ష్మీ వైభవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం కార్యక్రమ కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త వి.లక్ష్మీప్రసూన, బి.కాళికాదేవి, బి.శైలజ, వై. మణిశ్రీ, ఎం.అనూరాధ, ఎస్.లక్ష్మీబాయి, పోతుకూచి వరప్రసాద్ ఆవిష్కరించారు.

వైభవంగా ఆదిత్య హోమం

అవనిగడ్డ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): వేకనూరులో ఉషా పద్మిని సమేత సూర్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో ఆషాఢ బహుళ అమావాస్య సందర్భంగా గురువారం ఆదిత్య హోమం వైభవంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఉమామహేశ్వరరావు దంపతులు హోమం నిర్వహించారు. అర్చకుడు దీవి నరసింహమూర్తి స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తెలియని వారితో చాటింగ్ చేయకండి

• బాలికలకు ఎస్సై సుశీలాదేవి సూచన

మచిలీపట్నం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలియని వారితో చాటింగ్ చేయడం మంచిది కాదని బాలికలకు చిలకలపూడి మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై సుశీలాదేవి సూచించారు. బాలాజీ విద్యాలయం విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం చిలకలపూడి, తాలూకా పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. తాలూకా ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వివరాలు
ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

పెడన రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వివరాలు, ఇతర ఆదాయ మార్గాల వివరాలను ఆన్‌లైన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎండీవో నాగిరెడ్డి సూచించారు. పరిపాలన పారదర్శకంగా ఉండేందుకు, ఇకపై ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లించే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఇకమీదట పంచాయతీకి రాకుండా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. మండలంలోని 24 పంచాతీల్లో నివాస, వ్యాపార వర్గాకు చెందిన 9232 ఎసెస్‌మెంట్లు ఉన్నాయని, గురువారం 5549 ఆన్‌లైన్ అయ్యాయని తెలిపారు. మిగిలినవి శుక్రవారం పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. మడక, చెన్నూరు, చేవేంద్ర, కొంకేపూడి పంచాయతీల్లో ఆన్‌లైన్ విధానాన్ని నాగిరెడ్డి పరిశీలించారు.

ఆదర్శ కమ్యూనిస్టు
పరుచూరి శ్రీనివాసరావుకు సత్కారం

చల్లపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ఐదు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన ఆదర్శ కమ్యూనిస్టు పరుచూరి శ్రీనివాసరావును కమ్యూనిస్టు జిల్లా సమితి తరపున సీఆర్ వికాసకేంద్రంలో గురువారం సన్మానించారు. జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు నేతృత్వంలో సత్కరించి జ్ఞాపికను అందచేశారు. రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా నేత కంఠంనేని జ్యోత్స్నాదేవి, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు మేకా నరసింహారావు పాల్గొన్నారు.



పరుచూరి శ్రీనివాసరావును సత్కరిస్తున్న సీపీఐ జిల్లా నేతలు